వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 14 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలతో పాటు ఓయూ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే డిగ్రీ కోర్సుల (బీఏ, బీబీఏ, బీకామ్) పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

పీజీ కోర్సుల పరీక్షా తేదీలు మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సులు ఎంఏ, ఎంకామ్, ఎంకామ్ (ఐఎస్), ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్‌ఐఎస్సీ, ఎంజేఅండ్‌ఎంసీ, ఎమ్మెస్సీ తదితర కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 20వ తేదీ నుంచి నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ దాని నివాయిదా వేసినట్లు చెప్పారు. ఈ పరీక్షలను తిరిగి వచ్చే నెల 13వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఇంగ్లిష్ ప్రాక్టికల్స్‌కు హాజరు తప్పనిసరి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ) : ఇంగ్లిష్ ప్రాక్టికల్స్‌కు జిల్లాలోని ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా ఇంటర్ బోర్డు నోడల్ అధికారి డి.ఒడ్డెన్న సూచించారు. ఇంటర్ నుంచి ఆంగ్ల భాషా నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ఏడాది నుంచి మొదలైన ప్రాక్టికల్స్‌కు 20మార్కులు కేటాయించినట్లుగా తెలిపారు. నాలుగు దశల్లో జరిగే ఈ పరీక్షల్లో 7 మార్కులు వస్తేనే ఉత్తీర్ణులైనట్లని, ఇప్పటివరకు మూడు దశల్లో హాజరుకాని విద్యార్థులు ఈ నెల 16న జరిగే చివరి దఫా ప్రాక్టికల్ టెస్ట్‌కు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. అందుకు తగినట్లుగా జిల్లాలోని ఇంటర్ కాలేజీల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆకట్టుకున్న సాయి శ్రియా భరతనాట్య రంగ ప్రవేశం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 14 : ప్రపంచ స్థాయిలో ఎన్నో అవార్డులు సాధించిన ప్రముఖ భరత నాట్య గురువు శుభ ధనాంజయ్ శిష్యురాలు సాయి శ్రియా బుధవారం రవీంద్రభారతి మెయిన్‌హాల్ వేదికపై భారత నాట్య ప్రవేశం అందరినీ ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రెంటాల చంద్రశేఖర్(రి.ఐఏఎస్), ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, నాట్యగురువు ముద్దాళి ఉషా విచ్చేసి సాయి శ్రియాను అభినందించారు. ఈ కార్యక్రమంలో పి.రమాదేవి, సూర్యానారాయణ ఏనుగు భ్రమరాంబ, సాయి శ్రియా తల్లిదండ్రులు ఏనుగు సురేశ్, మణిరాధిక తదితరులు పాల్గొన్నారు.

జీవో 55ను విరమించుకోవాలి

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 14 : రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ యూనివర్సిటీ భూములను కాపాడాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల రాజకీయ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరసన 36వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థుల రాజకీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు సునీల్ మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబంలో పుట్టిన సీఎం రేవంత్ రెడ్డి జీవో 55ను వెంటనే విరమించుకోవాలని కోరారు. ఇలానే నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు సురేందర్, స్వాతి రెడ్డి, కమలాకర్, రాజ్ కుమార్, శ్రీజ, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే.. ఐటీపై పట్టు

- ఐటీ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్
- 3, 6, 9 నెలల పాటు విద్యార్థులకు కోచింగ్
- సమాజంలో ప్రతి అంశంపై ఏఐ ప్రభావం
- హైసియా జాతీయ సదస్సులో జయేశ్ రంజన్

హైసియా వార్షిక సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజన్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : ఐటీ కంపెనీల్లో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తే కంపెనీల్లో జరిగే కార్యకలాపాలను నేర్చుకొని నైపుణ్యం కలిగిన విద్యార్థిగా కళాశాల నుంచి బయటకు వస్తారని, అలాంటి వారికి సత్వరమే ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు లభిస్తాయని తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ అన్నారు. బుధవారం హెచ్‌ఐసీసీలో జరిగిన హైసియా (హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్) జాతీయ సదస్సు, అవార్డుల ప్రదానం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 'ఏఐ-సెలబ్రేటింగ్ ది ఫ్యూచర్' థీమ్‌తో నిర్వహించిన ఈ సదస్సులో జయేశ్ రంజన్ మాట్లాడుతూ కళాశాలల్లో చివరి సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు 3, 6, 9 నెలల పాటు ఆయా కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ డిజైన్ చేసి, వారికోసం మెంటార్‌లను నియమించాలని సూచించారు. దీంతో విద్యార్థులు మళ్లీ కొత్తగా కోచింగ్ తీసుకోవడం, అనుభవం కోసం రకరకాల మార్గాలను ఎంచుకోవాల్సిన అవసరం ఉండదని, విద్యా సంవత్సరం అయిపోతుండగానే నైపుణ్యాన్ని బట్టి ఉద్యోగావకాశం వచ్చేలా చేయాలన్నదే తెలంగాణ ప్రభుత్వం లక్ష్యమన్నారు. ప్రస్తుతం సమాజంలో ప్రతి అంశంపై ఏఐ ప్రభావం చూపుతున్నదని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) అత్యంత ప్రభావంతమైన టెక్నాలజీగా మారిందన్నారు. గత ఏడాది కాలంగా ఏఐతో వస్తున్న అప్లికేషన్లు విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. ఏఐను అన్ని రంగాల్లో వినియోగించేలా రకరకాల సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. టెక్ మహీంద్రా సీఈఓ, ఎండీ సీపీ.గుర్నానికి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీసీఎస్ అధ్యక్షుడు వి.రాజన్న, సెయింట్ సీఈఓ కార్తిక్ నటరాజన్, బీసీజీ ఎండీ సౌరభ్ చంద్ర, హైసియా అధ్యక్షురాలు మనిషా సాబూ, ఎస్‌టీపీఐ డైరెక్టర్ సి.కవిత తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఐసీ ఆవిష్కర్తకు అవార్డు

తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్(టీఎస్ఐసీ) నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్న ఇందులో ఫర్టిలైజర్ లేయింగ్ మిషన్‌ను రూపొందించిన శీలం సత్యనారాయణ రెడ్డి, త్రివిల్లర్ మొబైల్ మల్టీ క్రాప్ థ్రెషర్ మిషన్‌ను రూపొందించిన మహ్మద్ మైనుద్దీన్, మోద పెడల్ ఆపరేటింగ్ మిషన్ ఫర్ హ్యాండ్ లూమ్‌ను రూపొందించిన శివకుమార్ మోదకు అవార్డులు దక్కాయని టీఎస్ఐసీ ప్రతినిధి ప్రణయ్ తెలిపారు.

చెన్నై సిల్క్స్‌లో వివాహ సిల్క్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి14 : కూకట్‌పల్లి వై జంక్షన్‌లోని ది చెన్నై సిల్క్స్‌లో వివాహ సిల్క్ సంబురాలను బుధవారం సినీ నటి వైష్ణవి కృష్ణమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఆర్.మహేశ్, మేనేజర్లు త్యాగరాజన్, శర్వానన్, వినయ్‌కుమార్, సామ్రాట్ విక్రమ్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాటన్ హౌస్ తొలి బ్రాంచ్ ప్రారంభం

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి14 : బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14 లో 'కాటన్ హౌస్' తొలి బ్రాంచ్‌ను బుధవారం హెచ్‌హెచ్ శ్రీశ్రీ దేవనాథ రామానుజ జీయర్ స్వామి జీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిజాం రాజ వంశీయుడు నవాబ్ రౌనాక్ యార్ ఖాన్, కాటన్ హౌస్ వ్యవస్థాపకుడు అరుణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ రేఖ గోపాలకృష్ణను సన్మానిస్తున్న హీరో సుమన్, రోజారమణి, నటి కవిత

గో గీత లఘు చిత్రం విడుదల

రవీంద్రభారతి, ఫిబ్రవరి 14 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ , మానస ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖ సినీ దర్శక నిర్మాత డా.నిట్ట గోపాల కృష్ణ నటించి, స్క్రీన్‌ప్లే దర్శక నిర్మాణ సారథ్యంలో రూపుదిద్దుకున్న 'గో గీత' తెలుగు లఘు చిత్రం విడుదల, ప్రదర్శన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీనటుడు తల్వార్ సుమన్, ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సినీ నటీమణులు రోజారమణి, కవిత, డాక్టర్ మామిడి హరికృష్ణ, నంగునూరి చంద్రశేఖర్, ప్రముఖ కవి రఘుశ్రీ, గో గీత లక్ష్మణ రేఖ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ సీఎస్ఆర్‌లో..

వేద పాఠశాలకు సోలార్ పవర్ సిస్టం వితరణ

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 14 : కోఠిలోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా నగర శివారు శామీర్‌పేట మండలం పొన్నాల గ్రామంలోని శ్రీశంకర గురుకుల వేద పాఠశాలకు రూ.18 లక్షల వ్యయంతో సోలార్ పవర్ సిస్టంను బుధవారం ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ (కార్పొరేట్ బ్యాంకింగ్-అనుబంధ సంస్థలు) అశ్విని కుమార్ తివారి అందజేశారు. తమ సంస్థకు 41 కిలోవాట్‌ల సోలార్ రూఫ్ టాప్ అందజేసేందుకు ముందుకు వచ్చిన ఎస్‌బీఐకి ట్రస్టీ శ్రీరామ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్, సీసీజీ -4 సీజీఎం రమేశ్ రావు, ఎన్‌డబ్ల్యూ -2 జీఎం దేబాశిష్ మిత్రా, సీసీజీ ఆర్‌ఓ జీఎం విద్యారాజా, ఏజీఎం జి.రామకృష్ణతో పాటు డీజీఎంలు, సీనియర్ మేనేజర్లు ప్రతినిధులు పాల్గొన్నారు.

మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో ఏర్పాటు చేసిన హై లైఫ్ లగ్జరీ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నటీమణులు వర్షిణి సౌందరరాజన్, చాందిని భగ్‌వానీ విచ్చేసి ప్రముఖ మోడల్స్‌తో పాటు నిర్వాహకుడు డోమినిక్‌తో కలిసి బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నటీమణులు, మోడల్స్ సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. - మాదాపూర్, ఫిబ్రవరి 14

జలమండలిలో టీజీవో సభ్యత్వ నమోదు

సిటీబ్యూరో, జనవరి 14 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీవో) సెంట్రల్ కమిటీ సూచనల మేరకు జలమండలిలో టీజీవో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో టీజీవో హైదరాబాద్ జిల్లా సెక్రటరీ, జలమండలి శాఖ అధ్యక్షుడు మహమ్మద్ ఖాదర్ బుధవారం ప్రారంభించారు. ఇందులో జలమండలిలో ఉన్న గెజిటెడ్ ఆఫీసర్లందరూ సభ్యత్వం పొందారు. ఈ సందర్భంగా మహమ్మద్ ఖాదర్ పలువురికి సభ్యత్వ రశీదును అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఎంలు సరస్వతి, చంద్రజ్యోతి, కేదారేశ్వరి, సుగందిని, టీజీవో జలమండలి శాఖ ఈసీ మెంబర్లు రమేశ్‌బాబు, ఉత్తమ్ సింగ్, భీంరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిల్మ్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఓయూ అధికారులు, విద్యార్థి నిర్వాహకులు

మార్చి 27, 28న జాతీయ స్థాయి షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 14: ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో మార్చి 27, 28న జాతీయ స్థాయి షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఓయూ పరిపాలనా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో 'జామ్న్-ఏ-సైన్మా'గా వ్యవహరించే ఈ ఫెస్టివల్‌కు సంబంధించిన పోస్టర్‌ను వీసీ ప్రొఫెసర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చింత గణేశ్, జర్నలిజం విభాగం హెడ్ డాక్టర్ టి.సతీశ్ బుధవారం ఆవిష్కరించారు. ఇతర వివరాలకు jashnesainma@gmail.com మెయిల్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ విష్ణు దేవ్, ప్రొఫెసర్ కృష్ణకుమార్, ప్రొఫెసర్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

గోవును జాతీయ జంతువుగా గుర్తించాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 14 : గోవులను రక్షించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉన్నదని అఖిల భారత గో సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకృష్ణ అన్నారు. గోవును జాతీయ జంతువుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని గోషాల ప్రాంగణంలో అఖిల భారత గో సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ గో ప్రేమికుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు గోవులను ఆలింగనం చేసుకొని గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా బాలకృష్ణతో పాటు సిద్దిపేట గోషాల పీఠాధిపతి శ్రీ వీరధర్మజా స్వామి, గో రక్షణ సమితి మూడు రాష్ట్రాల ఇన్‌చార్జులు ఆకుతోట రామారావు, సంజీవ్ కుమార్ గుప్తా, సీడీ చౌహాన్, ఝాన్సీ, శ్రీలక్ష్మి, మహేశ్వరి తదితర గోషాల సభ్యులు గోవులకు పూల మాలలు వేసి హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇన్‌కాయిస్ అభివృద్ధికి.. హైదరాబాద్ సరైన ప్రాంతం

కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ మంత్రి కిరణ్ రిజిజు

దుండిగల్, ఫిబ్రవరి 14 : సైన్స్‌ను సమాజంలోకి తీసుకెళ్లడంలో ఇన్‌కాయిస్ (ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్) ప్రపంచం కంటే ఎంతో ముందున్నదని కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ప్రగతినగర్ సమీపంలోని భారత జాతీయ మహాసముద్ర సమాచార సేవా కేంద్రం (ఇన్‌కాయిస్)లో నూతనంగా ఏర్పాటు చేసిన 'సినర్జిస్టిక్ ఓషన్ అబ్జర్వేషన్ ప్రిడిక్షన్ సర్వీసెస్' (సైనోప్స్) కేంద్రాన్ని మంత్రి కిరణ్ రిజిజు బుధవారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశీయంగా, అంతర్జాతీయ స్థాయిలో ఇన్‌కాయిస్ సేవలందించడం అభినందనీయమన్నారు. ఇన్‌కాయిస్ మనదేశానికి గర్వకారణమన్న ఆయన హైదరాబాద్ నగరంలో ఇన్‌కాయిస్ అభివృద్ధికి సరైన ప్రాంతమన్నారు. ఈ సందర్భంగా ఇన్‌కాయిస్ ప్రతినిధులను ఆయన అభినందించారు. అంతకు ముందు ఇన్‌కాయిస్‌లోని వివిధ విభాగాలను ఆయన పరిశీలించి వాటి ద్వారా అందే సేవలను తెలుసుకున్నారు. మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్స్ సెక్రటరీ డా.ఎం.రవిచంద్రన్, ఇన్‌కాయిస్ డైరెక్టర్ డా.టి.శ్రీనివాసకుమార్‌లు మంత్రి కిరణ్ రిజిజుకు ఇన్‌కాయిస్ అందిస్తున్న సేవలతో పాటు సినర్జిస్టిక్ ఓషన్ అబ్జర్వేషన్ ప్రిడిక్షన్ సర్వీసెస్ పనితీరును వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ శాస్త్రవేత్తలు పట్టాభి రామారావు, అన్నపూర్ణయ్య, మురళీ, ఉదయ్, నాగరాజు, సుధీర్, జోసేఫ్, నాగేశ్వరరావు, సుబ్రమణ్యం, దేవేంద్రకుమార్, డి.ప్రసాద్, అనీష్, విఘ్నేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

కలెక్టర్‌ను కలిసిన డీపీఆర్‌వో అరుంధతి

డీపీఆర్‌వోగా అరుంధతి

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 14 : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పౌర సంబంధాల అధికారిగా అరుంధతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో హైదరాబాద్ జిల్లాలో అదనపు పౌర సంబంధాల అధికారిగా విధులు నిర్వహించారు.

మహిళా ఆంత్రప్రెన్యూర్లకు రుణ సౌకర్యం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : మహిళా ఆంత్రప్రెన్యూర్లకు లోన్ ఫెసిలిటీ, బ్యాంకర్లను అనుసంధానం చేసేలా వీ హబ్ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 19న లోన్ సాకర్యాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనుండగా మహిళా ఆంత్రప్రెన్యూర్లు సద్వినియోగం చేసుకోవాలని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలకు అవసరమైన ఆర్థిక ప్రోత్సాహం, లోన్ సదుపాయాలను పొందడానికి బ్యాంకర్లు, ఫైనాన్షియర్ సంస్థలు పాల్గొంటాయని తెలిపారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం.45లోని వీ హబ్ ప్రధాన కార్యాలయానికి ఈనెల 19న ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు పూర్తి ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

16న జాబ్ మేళా

అమీర్‌పేట్, ఫిబ్రవరి 14 : సనత్‌నగర్ సెయింట్ థెరిస్సా చర్చి ఆవరణలోని దిశ సంస్థ నేషనల్ కెరీర్ సర్వీస్, రంగారెడ్డి జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజ్‌లతో కలిసి 16వ తేదీ శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్న. ఈ జాబ్ మేళాకు 10వ తరగతి, ఇంటర్, గ్రాడ్యుయేషన్, జీఎన్ఎం, ఏఎన్ఎం, బీఎస్‌సీ నర్సింగ్, జీడీఏ, ఎంపీహెచ్‌డబ్ల్యు, హోటల్ మేనేజ్‌మెంట్, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో మేళాకు హాజరు కావచ్చని, మరిన్ని వివరాలకు 8977175394, 9494698219లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

నిజాం కళాశాల ప్రధాన ద్వారం ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్‌వీ విద్యార్థి నాయకులు నాగేందర్‌రావు, అవినాశ్ బలేం లాలు

విద్యాశాఖ మంత్రిని ప్రకటించకపోవడం సిగ్గుచేటు

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 14 : రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం పరీక్షా తేదీలను ప్రకటించడం సిగ్గుచేటని బీఆర్ఎస్‌వీ విద్యార్థి నాయకులు మండిపడ్డారు. బుధవారం విద్యాశాఖ మంత్రిని ఎప్పుడు నియమిస్తారని ప్రశ్నిస్తూ.. నిజాం కళాశాల ప్రధాన ద్వారం ముందు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌వీ విద్యార్థి నాయకులు కోదాటి నాగేందర్‌రావు, అవినాష్ బలేంలాలు మాట్లాడుతూ త్వరలోనే ఇంటర్ పరీక్షలు ఉన్నాయని తెలిసి కూడా ఇంత వరకు విద్యాశాఖ మంత్రిని ప్రకటించక పోవడం సరికదన్నారు. తెలంగాణ రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి కరువయ్యారా..? కాంగ్రెస్ పార్టీలో గెలిచిన ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా విద్యాశాఖ మంత్రిగా పనికిరారా.? అని ప్రశ్నించారు. నిరసన చేస్తున్న విద్యార్థులను అబిడ్స్ పోలీసులు అరెస్టు చేసి బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ విద్యార్థి నాయకులు సుశాంత్, ఉమేశ్, ధోని, జాన్, తరుణ్, రాకేశ్, వంశీ, క్రాంతి, సత్యం పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

సిటీబ్యూరో, జనవరి 14 (నమస్తే తెలంగాణ) : అగ్ని ప్రమాదాలపై చిన్నారులకు అవగాహన కల్పిస్తే వారి జీవితకాలం భద్రత నైపుణ్యాలు అలవర్చుకుంటారని ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి తెలిపారు. ఈవీడీఎం ఆధ్వర్యంలో 21 ప్రాంతాలలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆరు పబ్లిక్ ప్రాంతాలు, ఏడు షాపింగ్ మాల్స్ / షోరూంలు, ఏడు పాఠశాలలు / కాలేజీలు, ఒక దవాఖానలో వారం రోజులుగా మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. సెయింట్ జోసెఫ్ జూనియర్, డిగ్రీ కాలేజి (టొలిచౌకి), సికింద్రాబాద్ నవకేతన్ కాంప్లెక్స్, న్యూ మలక్‌పేట ది ఏబీఎం స్కూల్, కొత్తపేట సౌత్ ఇండియా షాపింగ్ మాల్, సుచ్రిత క్రాస్ రోడ్ జయభారతి మెడోస్ షాపింగ్ కాంప్లెక్స్‌లో మాక్ డ్రిల్ చేపట్టారు. వాణిజ్య భవనాలు, ఆసుపత్రులు, పాఠశాలలో మాక్ డ్రిల్ అవసరం అనుకుంటే 040-2955 5500, 9000113667లను సంప్రదించాలని కోరారు. రెసిడెన్షియల్ ఏరియాలో ప్రమాదకర రసాయన నిల్వలు ఉన్నట్లయితే 040-2955 5500, 9000113667 వాట్సప్ చేయాలన్నారు.

డాక్టర్ ఏఎస్‌రావు అవార్డ్స్ కౌన్సిల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న కన్వీనర్ డాక్టర్ జీఎస్‌వీఆర్‌కే.చౌదరి, అధ్యక్షుడు ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు, కార్యదర్శి రామరాజు

పరీక్షా ఫలితాలు విడుదల

చర్లపల్లి, ఫిబ్రవరి 14 : డాక్టర్ ఏఎస్‌రావు అవార్డ్ కౌన్సిల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షా ఫలితాలను కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్ జీఎస్‌వీఆర్‌కే చౌదరి, అధ్యక్షుడు ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు, కార్యదర్శి రామరాజు విడుదల చేశారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన 155విద్యార్థులు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. కౌన్సిల్ కోశాధికారి డాక్టర్ ఎంవీఎస్.మహేంద్ర, సభ్యులు లక్ష్మణ్ రాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పరీక్షా తేదీలు ఖరారు

ఓయూ పరిధిలోని ఎమ్మెస్సీ (మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనిటిక్స్) మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎమ్మెస్సీ (ఐఎస్) మొదటి, రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 20వ తేదీ నుంచి, బీఈడీ (ఓడీఎల్) మూడో సెమిస్టర్ రెగ్యులర్, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను 21వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.